సాక్షి నల్లగొండ

శనివారం : 13 : జూలై : 2024



రూ.కోటిన్నర ఆదాయం

నల్లగొండ రీజియన్‌లో ఆర్టీసీకి రోజూ రూ.కోటిన్నర వరకు ఆదాయం వస్తోందని ఆర్‌ఎం తెలిపారు. - 8లో



కెమికల్ గ్యాస్ లీక్

దండుమల్కాపురం శివారులోని పరిశ్రమలో రసాయన వాయువు లీకవడంతో ఉద్యోగులు అస్వస్థతకు గురయ్యారు. - 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం

32° / 25°

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

ఆగస్టు నెలాఖరులోగా..

గుడుంబా రహితంగా

సారా నిర్మూలనకు ఎక్సైజ్ శాఖ కార్యాచరణ

- ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తనిఖీలు
- గడిచిన ఆరు నెలల్లో 615 కేసులు నమోదు
- అవగాహన కల్పించే కార్యక్రమాలపైనా దృష్టి



గుడుంబా తయారీకి వినియోగించే ద్రావణాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ సిబ్బంది



గుడుంబా నిర్మూలనకు సహకరించాలని దేవరకొండలో అవగాహన కార్యక్రమం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : గుడుంబా (సారా) మహమ్మారిని తరిమికొట్టేందుకు జిల్లా ఎక్సైజ్ యంత్రాంగం నడుం బిగించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు నెలాఖరుకల్లా నల్లగొండను గుడుంబా రహిత జిల్లాగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఎక్సైజ్ స్టేషన్ల సిబ్బంది, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల ఆధ్వర్యంలో జిల్లాలో గుడుంబా ప్రభావిత ప్రాంతాల్లో దాడులు చేస్తూ తయారీదారులపై కేసులను నమోదు చేస్తోంది. మరోవైపు గుడుంబా వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ గ్రామీణ ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమాలను ముమ్మరం చేసింది.

గుడుంబా తయారీ, అమ్మకందారులపై ఆరు నెలల్లో కేసులు, అరెస్టులు ఇలా..

ప్రాంతం	కేసులు	అరెస్టులు
నాంపల్లి	78	15
దేవరకొండ	317	154
హాలియా	82	19
మిర్యాలగూడ	125	63
చండూరు	10	0
నకిరేకల్	2	-
నల్లగొండ	1	1

ఏడు ప్రాంతాల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు

ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లకు చెందిన సిబ్బందితోపాటు సివిల్ పోలీసులను కలుపుకొని బృందాలుగా ఏర్పడి గుడుంబా నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. వీరితోపాటు టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సైతం రంగంలోకి దిగాయి. జిల్లాలోని దేవరకొండ, నాంపల్లి, హాలియా, మిర్యాలగూడ, చండూరు, నకిరేకల్, నల్లగొండ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి దాడులు నిర్వహిస్తున్నాయి. గుడుంబా తయారుచేసి అమ్మేవారు, గతంలో కేసుల్లో ఉన్న వారు, అనుమానం ఉన్న వారిని కూడా బైండోవర్ చేస్తున్నారు.

ఆరు నెలల్లో 615 కేసులు నమోదు

గుడుంబా నిర్మూలన కోసం ఎక్సైజ్ శాఖ చేపట్టిన దాడుల్లో భాగంగా ఈ ఏడాది జనవరి నుంచి జూన్ 30వ తేదీ వరకు 615 కేసులను నమోదు చేసింది. 252 మందిని అరెస్టు చేసి జైలుకు పంపించింది. గుడుంబా తయారు చేసేందుకు ఉపయోగించే నల్ల బెల్లం రవాణా చేస్తున్న 45 వాహనాలను సీజ్ చేయడంతోపాటు 1,630 లీటర్ల గుడుంబాను, 11,133 కిలోల నల్ల బెల్లం, 1,190 కిలోల ఆలంను సీజ్ చేసింది. తయారీ ప్రాంతాల్లో 1,28,160 లీటర్ల గుడుంబాను ధ్వంసం చేసింది.

నిలిచిపోయిన పునరావాస కార్యక్రమం

రాష్ట్ర వ్యాప్తంగా గుడుంబా తయారీ చేసే కుటుంబాలకు పునరావాసం కల్పించే కార్యక్రమం 2018లోనే ఆగిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో ఎక్సైజ్ యంత్రాంగం వారికి ప్రత్యామ్నాయం ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో మొదటిసారి గుడుంబా తయారుచేసే వారి పట్ల మరీ కఠినంగా వ్యవహరించకుండా వారిలో అవగాహన కల్పిస్తోంది. గ్రామీణ ప్రాంతాలు, తండాల్లో గుడుంబా తాగే వారిలో సైతం ఆరోగ్యంపై చైతన్యం తీసుకువచ్చే చర్యలకు శ్రీకారం చుట్టింది.

గుడుంబా లేకుండా చేయడమే లక్ష్యం



జిల్లాలో గుడుంబా తయారీని అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున దాడులు నిర్వహిస్తున్నాం. ప్రజల్లోనూ అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపట్టాం. ఆగస్టు 31వ తేదీ నాటికి జిల్లాలో గుడుంబా ఆనవాళ్లు లేకుండా చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. గుడుంబా నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలి.

– బి.సంతోష్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

గుణాత్మక విద్యనందించడమే లక్ష్యం

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి
- నకిరేకల్‌లో ఉద్దీపన వీవీఎం ఎయిడెడ్ స్కూల్ ప్రారంభం



ఉద్దీపన స్కూల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, పక్కన ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ప్రెస్ అకాడమీ చైర్మన్ తదితరులు

నకిరేకల్ : ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యనందించమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నకిరేకల్ పట్టణంలో ఉద్దీపన ఫౌండేషన్ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో పట్టణంలో వాసవీ కళాశాలలో ఉద్దీపన వీవీఎం ఎయిడెడ్ పాఠశాలను కలెక్టర్ నారాయణరెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చదువుకున్న వారికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రక్షాళన చేసి ప్రైవేట్‌కు దీటుగా నడిపేందుకు ప్రభుత్వ ముందుకు సాగుతోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న పిల్లలకు ఉచిత విద్యను అందించేందుకు ఉద్దీపన స్కూల్‌ను ప్రారంభించే ఆలోచన రావడం హర్షించదగ్గ విషయమన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో పైకి రావాలంటే విద్యనే ప్రధాన ఆధారమన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం ఉద్దీపన స్కూల్ ప్రారంభించి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పేద పిల్లల కోసం ఉద్దీపన స్కూల్‌ను ప్రారంభించడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాలను తయారు చేసేందుకు ముందుకు వచ్చిన ఎమ్మెల్యే వీరేశం సంకల్పం గొప్పదన్నారు. ఇదే స్ఫూర్తితో మా నియోజకవర్గంలో కూడా ఉద్దీపన పాఠశాల ప్రారంభించేందుకు ముందుకు సాగుతానన్నారు. ఎమ్మెలే వేముల వీరేశం మాట్లాడుతూ పేద, అణగారిన పిల్లలకు ఇంగ్లిష్ మాధ్యమంలో ఉచిత విద్యనందించాలన్న సంకల్పంతో 2015 నుంచి ఆలోచన చేసి మేధావుల సలహాలతో ఉద్దీపన పాఠశాలను ప్రారంభించామన్నారు. పేద విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలనేది ఉద్దీపన ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా ఉద్దీపన పాఠశాలకు విరాళంగా బిజీ ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్‌రావు రూ.5 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీఈఓ భిక్షపతి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, ఉద్దీపన చీఫ్ అడ్వైజర్లు కె.ఆనంద్, మంగారెడ్డి, ఎంఈఓ నాగయ్య, ఉద్దీపన వీవీఎం పాఠశాల హెచ్‌ఎం భద్రయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, వేదికపై ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ తదితరులు

యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కపిల్ దామోదర్

నల్లగొండ : యూత్ కాంగ్రెస్ బలోపేతం కోసం ప్రతి కార్యకర్తా కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ ఎన్నికల అధికారి కపిల్ దామోదర్ అన్నారు. శుక్రవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్‌లో అన్ని కమిటీలను రద్దు చేశామన్నారు. యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తి ఉన్నవారు విత్ ఐవైసీ యాప్ ద్వారా నామినేషన్ వేయవచ్చని తెలిపారు. ఈనెల 20 వరకు నామినేషన్ల స్వీకరణ, 22 నుంచి 26 వరకు స్క్రూటినీ, 28న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామన్నారు. ఆగస్టు 5 నుంచి సెప్టెంబర్ 5 వరకు సభ్యత్వ నమోదు, ఎన్నికల నిర్వహణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, కొర్రా రాంసింగ్, షేక్ జహంగీర్‌బాబా, పుట్ట రాకేష్, మంచికంత సిద్ధార్థ, గాలి నాగరాజు, నందిని, కొప్పు నవీన్‌గౌడ్, రాజిరెడ్డి, అజార్, ప్రవీణ్, మామిడి కార్తీక్, పాదం అనిల్, వంశీ, పవన్ యాదవ్, సల్ల నరేష్, మేరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, హరిప్రసాద్, అజారుద్దీన్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రంగారెడ్డి

మిర్యాలగూడ : రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందచేసి మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న ధరణి సమస్యలను పరిష్కరించడంతోపాటు పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని, సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి బీడు భూములకు సాగునీరు అందించాలని, రుణమాఫీని అమలు చేయాలని, రైతు భరోసా నగదును రైతుల ఖాతాల్లో జమా చేయాలని కోరారు. కల్తీ విత్తనాలను, ఎరువులను అరికట్టి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

జోరుగా రిజిస్ట్రేషన్లు



నల్లగొండ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద బారులుదీరిన జనం

నల్లగొండ : సాంకేతిక లోపం కారణంగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్లు ఆగిపోయిన విషయం తెలిసిందే. ఆ సాంకేతిక లోపాన్ని సవరించడంతో శుక్రవారం రిజిస్ట్రేషన్లు జోరుగా సాగాయి. రిజిస్ట్రేషన్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద భూములు, స్థలాలు, ఇళ్ల అమ్మకం, కొనుగోలుదారులు బారులుదీరారు. రెండు రోజుల్లో బుక్ చేసుకున్న రిజిస్ట్రేషన్లు ఒకేసారి రావడంతో జనాలతో సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాలు కిటకిటలాడాయి.

రెండు రోజుల రిజిస్ట్రేషన్లు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో రోజూ దాదాపు 600 వరకు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. అయితే గురువారం రిజిస్ట్రేషన్లు ఆగిపోవడం, శుక్రవారం సాంకేతిక సమస్య పరిష్కారం కావడంతో రిజిస్ట్రేషన్లు యథావిధిగా ప్రారంభమయ్యాయి. దీంతో రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్ల కోసం బుక్ చేసుకున్న జనాలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో బారులుదీరారు. దీంతో ఒక్కరోజే దాదాపు 1200 పైచిలుకు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. వ్యవసాయ భూములకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయాల్లో ఆగిపోయిన రిజిస్ట్రేషన్లతో పాటు కొత్తగా స్లాట్ బుక్ చేసుకున్న రిజిస్ట్రేషన్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగాయి.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

దేవరకొండ : జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తి చేయాలని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి కోరారు. శుక్రవారం దేవరకొండలో నిర్వహించిన నియోజకవర్గ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని శ్రీశైలం సొరంగ మార్గం పనులను పూర్తి చేసి నక్కలగండి పథకానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా రైతులకు రెండు లక్షల రుణాన్ని ఏకకాలంలో మాఫీ చేయాలని కోరారు. రైతు భరోసా విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. సీపీఐ నాయకుడు బొల్లె శైలేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, రమావత్ అంజయ్యనాయక్, పల్లా దేవేందర్‌రెడ్డి, బొడ్డుపల్లి వెంకటరమణ, పల్లె నర్సింహ, బుచ్చిరెడ్డి, వెంకటయ్య, నూనె రామస్వామి తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

నీలగిరికి రూ.600 కోట్లు

పట్టణాభివృద్ధిపై మంత్రి కోమటిరెడ్డి ఫోకస్

- అమృత్, టఫ్‌ఐడీసీ నిధులు రూ.328 కోట్లు
- ఎస్‌ఎల్‌బీసీ కాల్వ లైనింగ్‌కు రూ.25 కోట్లు
- మరో రూ.138 కోట్ల కోసం ఇటీవల ముఖ్యమంత్రిని కలిసిన మంత్రి, మున్సిపల్ చైర్మన్
- త్వరలో విడుదలయ్యే అవకాశం



నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణానికి భారీగా నిధులు వస్తున్నాయి. పట్టణంలో మౌలిక సదుపాయాలు, తాగునీరు, డ్రెయినేజీ, సీసీ రోడ్లు, నాలాలు, ఎస్‌ఎల్‌బీసీ కాల్వ లైనింగ్ తదితర అభివృద్ధి పనులకు సుమారు రూ.600 కోట్లు వెచ్చించనున్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేసేందుకు డీపీఆర్ తయారు చేయించి ప్రభుత్వానికి పంపిస్తున్నారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో మాట్లాడి నిధుల విడుదలలో జాప్యం లేకుండా తక్షణ చర్యలు తీసుకుంటున్నారు. చిన్న, చిన్న కారణాలతో హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయాల్లో నెలల తరబడి పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు మున్సిపల్ చైర్మన్, స్థానిక అధికారులతో మాట్లాడి ఫైళ్లు కదిలేలా మార్గం సుగమం చేస్తున్నారు. అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

నిధులు మంజూరు ఇలా..

అంతర్గత పనుల కారణంగా పెండింగ్‌లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి అమృత్ స్కీం–2 కింద రూ.218 కోట్లు, రూ.56 కోట్లతో తాగు నీటి పైప్‌లైన్, 12 నీటి ట్యాంకుల నిర్మాణానికి నిధులను మంజూరు చేయించారు. విలీన గ్రామాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణానికి గాను తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టఫ్‌ఐడీసీ) కింద రూ.54 కోట్లు, ఎస్‌ఎల్‌బీసీ కాల్వ లైనింగ్ పనులకు రూ.25 కోట్లు, నీలగిరి కళావేదిక డిజైన్లలో మార్పులు, చేర్పులు చేసి తిరిగి రూ.96 కోట్లు విడుదల చేయించారు.

మంత్రి కృషితోనే భారీగా నిధులు



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నీలగిరి పట్టణాభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి నుంచి రూ.వందల కోట్ల నిధులు మంజూరు చేయించారు. మంత్రి కృషితోనే నిధులు వస్తున్నాయి. విలీన గ్రామాలకు ప్రాధాన్యం ఇచ్చి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం. నాలాలు, యూజీడీ, సీసీ రోడ్ల నిర్మాణం నాణ్యతతో చేపట్టి త్వరగా పూర్తి చేస్తాం.

– బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్, నల్లగొండ

ఎస్‌ఎల్‌బీసీ కాల్వకు లైనింగ్..

నీలగిరి పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు సుందరయ్య కాలనీ నుంచి పానగల్ ఉదయ సముద్రం వరకు ఎస్‌ఎల్‌బీసీ కాల్వ లైనింగ్ చేపట్టేందుకు మంత్రి రూ.25 కోట్లు మంజూరు చేయించారు. పట్టణ పరిధిలో కాల్వను సుందరంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఆ ప్రాంతంలో చెత్త, చెదారం కాల్వలో పడవేయకుండా, నీరు కలుషితం కాకుండా ఉండేలా లైనింగ్ దోహద పడనుంది. వీటితో పాటు పట్టణంలో పెరిగిన విద్యుత్ వినియోగంతో లో ఓల్టేజీ సమస్యకు చెక్ పెట్టేందుకు మూడు సబ్‌స్టేషన్లు మంజూరు అయ్యాయి. వీటిలో ఒక దానికి శంకుస్థాపన జరుగగా, మిగతా వాటికి స్థలాల కోసం అన్వేషిస్తున్నారు.

సీఎంను కలిసిన మంత్రి, చైర్మన్..

నీలగిరి పట్టణంలోని శివారు కాలనీలు, విలీన గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో స్థానిక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. చిన్న, చిన్న వర్షాలకు మట్టి రోడ్లు చిత్తడిగా మారడం, సరైన నాలా వ్యవస్థ లేకపోవడంతో వరద నీరంతా పట్టణం నుంచే పారి నష్టం జరుగుతోంది. దాంతో నాలాల నిర్మాణం, సీసీ రోడ్లు, శ్మశాన వాటికల అభివృద్ధి కోసం రూ.138 కోట్లు కావాలని డీపీఆర్ తయారు చేయించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నేతృత్వంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. త్వరలోనే ఈ నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అదే విధంగా గతంలో నీలగిరి కళావేదిక నిర్మాణానికి గతంలో నిధులు రద్దు అయ్యాయి. తిరిగి కళావేదిక డిజైన్లలో మార్పులు, చేర్పులు చేసి రూ.96 కోట్లు విడుదల చేయించారు.



రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు మంత్రుల రాక

నల్లగొండ : రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ఉదయం 10 గంటలకు నల్లగొండకు రానున్నారు. ఉదయం 11 గంటలకు ఆర్టీసీ బస్టాండ్‌లో నాలుగు కొత్త బస్సులను ప్రారంభిస్తారు. ఆ తర్వాత 11.30 గంటలకు హైదరాబాద్ రోడ్డులోని బీసీ భవన్ ఎదురుగా సావిత్రీబాయిపూ లే, జ్యోతిరావు పూలే విగ్రహాలను ఆవిష్కరిస్తారు. ఆ తర్వాత మంత్రి కోమటిరెడ్డి కనగల్ మండలంలోని బాబుసాయిగూడెంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరై తిరిగి హైదరాబాద్ వెళ్తారు.

మట్టి, ఇసుక అక్రమ రవాణా జరగొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నల్లగొండ : ఒండ్రు మట్టి, మొరం, ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆర్డీఓలు, ఇరిగేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో వర్షం నీటికి గండ్లు పడేందుకు అవకాశం ఉన్న చెరువులను గుర్తించి మరమ్మతులు చేపట్టాలన్నారు. మట్టి విషయంలో సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తేవాలన్నారు. ప్రభుత్వ, అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా వచ్చే శుక్రవారం నాటికి కంచె ఏర్పాటు చేయాలన్నారు. ప్రాజెక్టుల కింద రిజర్వాయర్ల వారీగా భూసేకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, అధికారులు రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

15న అప్రెంటిషిప్ మేళా

నల్లగొండ : ఇంటర్మీడియట్‌లో వృత్తి విద్య (ఒకేషనల్ కోర్సు) పూర్తి చేసిన విద్యార్థులకు ఈ నెల 15న నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో అప్రెంటిషిప్ కమ్ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డీఐఈఓ ఆర్.దస్రూనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021–22, 2022–23, 2023–24 విద్యా సంవత్సరాల్లో ఇంటర్‌లో వృత్తి విద్య పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళాకు 15 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

గ్రామీణ వైద్యుల పొట్టకొట్టొద్దు



మాట్లాడుతున్న హనుమంతరావు

నల్లగొండ టౌన్ : గ్రామీణ వైద్యుల క్లినిక్‌లపై ఐఎంఏ, నేషనల్ కౌన్సిల్ సభ్యుల పేరుతో దాడులు నిర్వహిస్తూ గ్రామీణ వైద్యుల పొట్ట కొట్టవద్దని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.హనుమంతరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నల్లగొండలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, తమపై దాడులను నివారించాలని కోరుతూ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క , రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు విన్నవించామని వారు సానుకూలంగా స్పందించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. గ్రామీణ వైద్యులమంతా ప్రభుత్వం ఇచ్చిన శిక్షణను కూడా పూర్తి చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి జి.నర్సింహారెడ్డి, కోశాధికారి బ్రహ్మాచారి, డీఎస్‌ఎన్.చారి, ఎండీ.నజీరుద్దీన్, వెంకటేశ్వర్లుగౌడ్, ఎం.మదనాచారి, లలిత, మణికుమారి, రాజశేఖర్‌రావు, యాదగిరి, కృష్ణారెడ్డి, అంజయ్య, ప్రభుదాస్ పాల్గొన్నారు.

కనుల పండువగా ఊంజలి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం ఊంజలి సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. సాయంత్రం వేళ ఆండాళ్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ తిరు, మాడ వీధుల్లో భక్తుల మధ్యన ఊరేగించారు. అమ్మవారి సేవకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో సేవను అధిష్టింపజేసి ఊంజలి సేవోత్సవం నిర్వహించారు.

క్లుప్తంగా

చోరీ కేసులో ఇద్దరికి జరిమానా

రామన్నపేట, మోత్కూరు: మేకల దొంగత నానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులకు రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్ గురువారం ఒక్కొక్కరికి రూ.ఆరు వేల చొప్పున జరిమానా విధించారు. మోత్కూరు మండలానికి చెందిన పురుషోత్తం, నవీన్‌లు మేకల దొంగతనానికి పాల్పడినట్లు 2022లో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఒక్కొక్కరిపై రెండు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. నేరం రుజువు కావడంతో ఒక్కో వ్యక్తికి రూ.6వేల చొప్పున ఇద్దరికి రూ.12వేల జరిమానా విధించారు.

ఆకతాయిల మధ్య ఘర్షణ



రామిరెడ్డిపాలెం రోడ్డులో దాడి చేసుకుంటున్న యువకులు

కోదాడరూరల్: కోదాడ పట్టణంలోని రామిరెడ్డిపాలెం రోడ్డులో కొందరు యువకులు శుక్రవారం ఘర్షణకు దిగారు. రెండు వర్గాలకు చెందిన సుమారు 50 మంది యువకులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకునేలోపే యువకులు పరారయ్యారు. రోడ్డుపై ఇలాంటి ఘర్షణలకు పాల్పడుతున్న ఆకతాయిలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

వేములపల్లి(మాడ్గులపల్లి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం గ్రామ శివారులో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండల కేంద్రానికి చెందిన మల్లికంటి రాములు, త్రిపురారం మండలం గుంటిపల్లి అన్నారం గ్రామానికి చెందిన మల్లికంటి శ్రీను వేములపల్లిలో తమ బంధువు చనిపోవడంతో అక్కడికి వచ్చారు. తిరిగి మాడ్గులపల్లి వైపు టీవీఎస్ వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. వారిద్దరు కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు శ్రీను, రాములును చికిత్స నిమిత్తం నల్లగొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శ్రీను పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. శ్రీను కుమారుడు దినేష్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు.

ఆభరణాలు అపహరించిన ఇద్దరి అరెస్టు

రామన్నపేట: ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ ఆభరణాలను దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను రామన్నపేట పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. రామన్నపేటకు చెందిన లవనం ఇందిర ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లోని తన కూతురు ఇంటికి వెళ్లి తిరిగి వస్తూ చిట్యాలలో ఆటో ఎక్కింది. తన చెవికమ్మలు, కాళ్లపట్టీలను బాక్స్‌లో పెట్టి బ్యాగులో దాచింది. అదే ఆటో ఎక్కిన ఇద్దరు వ్యక్తులు బ్యాగులోని బాక్స్‌ను తీసి రామన్నపేట శివారులో దిగిపోయారు. బాధితురాలు రామన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శుక్రవారం పోలీసులు కొమ్మాయిగూడెం వెళ్లేదారిలో రైల్వే బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో వెళ్తున్న కర్నూలు జిల్లా దోనే మండలం చిగురుమానుపేట గ్రామానికి చెందిన కావటి గంగరాజు, కావటి తులసి అనే ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా ఆభరణాలు దొంగిలించినట్లు అంగీకరించారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి నిందితులకు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ మల్లయ్య తెలిపారు.

బ్యాటరీ దొంగల ముఠా అరెస్టు

- రూ.7 లక్షల విలువైన 100 బ్యాటరీలు, ట్రాలీ ఆటో స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం: ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌లకు ఉపయోగించే బ్యాటరీలను చోరీ చేస్తున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.7,18,000 విలువైన 100 బ్యాటరీలు, ఒక ట్రాలీ ఆటో, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడించారు. జిల్లా విద్యాధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీఎస్, శాలిగౌరారం, నకిరేకల్ పోలీసులతో కలిసి ఒక టీమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. బ్యాటరీ దొంగలపై నిఘా ఉంచి శాలిగౌరారం మీదుగా హైదరాబాద్‌కు ఆటోలో బ్యాటరీ లోడ్‌తో వెళ్తున్నట్లు సమాచారం అందడంతో శాలిగౌరారం గ్రామ పరిధిలో ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా బ్యాటరీల దొంగతనం బయటపడిందని తెలిపారు. నకిరేకల్ పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ గోపగాని జగన్, ఆవుల తిమ్మయ్య, ఆవుల సంజీవ, నాగిల్ల నాగరాజులు వేర్వేరు ముఠాగా ఏర్పడి బ్యాటరీల దొంగతనం చేస్తున్నట్లు వెల్లడించారు. గోపగాని జగన్, ఆవుల తిమ్మయ్య ముఠాలో మరో 10 మందితో పాటు ఆరుగురు మహిళలు ఉన్నారని మరో ముఠా సభ్యులైన ఆవుల సంజీవ, నాగిల్ల నాగరాజు ముఠాలో నలుగురు మహిళలు ఉన్నట్లు తెలిపారు. రెండు ముఠాల్లో చోరీలో భాగస్వామ్యంలో ఉన్న వారంతా పరారీలో ఉన్నారన్నారు. రెండు ముఠాలకు చెందిన వారు ఒకే సామాజిక వర్గానికి చెందిన బంధువులు. గతంలో నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో చోరీ కేసులో పట్టుబడి జైలు నుంచి వచ్చిన తర్వాత కూడా మళ్లీ అదే నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో కట్టంగూర్, శాలిగౌరారం, కేతేపల్లి, నకిరేకల్, తిప్పర్తి, మాడ్గులపల్లి, సూర్యాపేట జిల్లాలో చివ్వెంల, సూర్యాపేట రూరల్, ఆత్మకూర్‌ఎస్, అర్వపల్లి, పోలీస్ స్టేషన్ల పరిధిలో 17 ప్రభుత్వ పాఠశాలల్లో వరుస బ్యాటరీ దొంగతనాలు చేసినట్లు చెప్పారు. ముఠా సభ్యులను పట్టుకున్న పోలీస్ టీమ్‌ను ఎస్పీ అభినందించడంతో పాటు రివార్డు అందజేస్తారని డీఎస్పీ తెలిపారు. డీఈఓ భిక్షపతి మాట్లాడుతూ.. ఒక్క బ్యాటరీ విలువ రూ.50వేలు ఉంటుందని పేర్కొన్నారు. దొంగలను పట్టుకున్న పోలీసులను ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, నకిరేకల్ సీఐ రాజశేఖర్, శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ఎస్‌ఐ సైదులు, సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ విష్ణువర్ధన్‌గిరి, శ్రీధర్‌రెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేడియో రిమోట్ యూనిట్ చోరీ ముఠాలో ఒకరి అరెస్టు

ఉమ్మడి నల్లగొండ మహబూబ్‌నగర్, గుంటూరు జిల్లాల్లో పలు ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ టవర్లకు 5జీ సిగ్నల్ కోసం బిగించే రేడియో రిమోట్ యూనిట్ (ఆర్‌ఆర్‌యూ)లను చోరీ చేస్తున్న దొంగల ముఠాలో మిర్యాలగూడ మండలం ధీరావత్ తండాకు చెందిన ధీరావత్ నగేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ శివరాంరెడ్డి వివరాలు వెల్లడించారు. సెల్‌టవర్లలో గత 7, 8 సంవత్సరాలుగా పని చేసిన దీరావత్ నగేష్ గతంలో అనంతపురం జిల్లా రాయపర్తిలో జరిగిన చోరీ కేసులో అరెస్టై బెయిల్‌పై వచ్చాడు. తిరిగి సెల్ టవర్‌లో ఆర్‌ఆర్‌యూ చోరీలకు పాల్పడుతున్నాడు. ఇతడిపై 17 కేసులున్నాయని 9 కేసుల్లో నిందితుడిగా తేలినట్లు తెలిపారు. సెల్ టవర్లలో విలువైన వైర్లు చోరీ చేసిన ఘటనలో ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేశామని చెప్పారు.

పరిశ్రమలో కెమికల్ గ్యాస్ లీక్

- 11 మంది కార్మికులకు అస్వస్థత

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ శివారులోని శ్రీజయ ల్యాబొరేటరీస్ పరిశ్రమలో రసాయన వాయువులు లీక్ కావడంతో అందులో పనిచేసే ఉద్యోగులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన గురువారం జరగగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గురువారం ఉదయం పరిశ్రమలోని ఒక ట్యాంకు నుంచి అకస్మాత్తుగా రసాయన వాయువులు లీకయ్యాయి. దీంతో ఆ బ్లాక్‌లో విధులు నిర్వహిస్తున్న 11మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సహచరులు, పరిశ్రమ నిర్వాహకులు కలిసి బాధితులను హుటాహుటిన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారిలో ముగ్గురు కార్మికులు చికిత్స పొందిన తర్వాత అదే రోజు డిశ్చార్జి అయ్యారు. మిగిలిన వారిలో కృష్ణంరాజు, నాగబాబు, గోపికృష్ణ, రాంబాబు, లలిత్‌శెట్టి, చిన్నబాబు, శ్రీనివాస్‌రావు, గిరిబాబు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. వీరిలో నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో నివాసం ఉండే బాధితుడు నేలపట్ల రాంబాబు భార్య గౌతమి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చౌటుప్పల్ సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు

అమెరికా భక్తురాలి సెల్‌ఫోన్ అపహరణ

- లొకేషన్ ఆధారంగా గుర్తించి బాధితురాలికి అందజేసిన పోలీసులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ సన్నిధిలో సెల్‌ఫోన్ చోరీ చేసిన వ్యక్తిని ఎస్‌పీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. అమెరికాకు చెందిన శ్రీనివాస్, తన కుమార్తె జయకస్తూరి శుక్రవారం ఉదయం 9గంటలకు బ్రేక్ దర్శనానికి వచ్చారు. టిక్కెట్లు కొనుగోలు చేసిన తరువాత కొండపైన గల బస్టాండ్‌లో సంప్రదాయ దుస్తులు మార్చుకునే క్రమంలో వారి సెల్‌ఫోన్లను పక్కన పెట్టారు. ఈ సమయంలో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఐ ఫోన్‌ను గుర్తించి తీసుకెళ్లాడు. దర్శనానికి వెళ్లే సమయంలో జయకస్తూరి తన ఫోన్ చూసుకోగా కనిపించలేదు. దీంతో ఎస్‌పీఎఫ్ సీఐ శేషగిరిరావు, ఇతర పోలీసులకు సమాచారం అందించింది. సీసీ కెమెరాలు, లొకేషన్ ఆధారంగా గుర్తించి, సెల్‌ఫోన్‌తో వెళ్తున్న అతడిని పట్టుకుని యాదగిరిగుట్ట పట్టణ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అమెరికాలో ఉండే తమ డేటా అంతా సెల్‌ఫోన్‌లోనే ఉందని, ఆ ఫోన్ పోతే చాలా ఇబ్బందిగా ఉండేదని జయకస్తూరి పేర్కొంది. చోరీ జరిగిన గంట వ్యవధిలోనే సెల్‌ఫోన్ గుర్తించి, అందజేసిన ఎస్‌పీఎఫ్ పోలీసులకు అమెరికాకు చెందిన భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌పీఎఫ్ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ సిబ్బంది ఉన్నారు.



సెల్‌ఫోన్ అందజేస్తున్న సీఐ శేషగిరిరావు

నల్లగొండ రీజియన్‌లో రూ.కోటిన్నర ఆదాయం

- రీజినల్ మేనేజర్ రాజశేఖర్

మిర్యాలగూడ టౌన్: నల్లగొండ రీజియన్‌లో ఏడు డిపోల ద్వారా 640 ఆర్టీసీ బస్సులు ప్రతి రోజు 2,50,000 కిలో మీటర్ల మేర తిరుగుతున్నాయని, వీటి ద్వారా ఆయా డిపోల నుంచి ఆర్టీసీకి రూ. కోటిన్నర వరకు ఆదాయం వస్తుందని ఆర్టీసీ నల్లగొండ రీజినల్ మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌ను ఆయన సందర్శించారు. సంస్థకు చెందిన రికార్డులు పరిశీలించారు. ఆర్టీసీ డిపో ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. కోవిడ్ కారణంగా రద్దయిన ప్రాంతాలకు తిరిగి బస్సులను పునరుద్ధరించాలన్నారు. ప్రస్తుతం రీజియన్‌కు 30డీలక్స్, ఎక్స్‌ప్రెస్‌లు బస్సులు వచ్చాయని, మరో 30 వరకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించినట్లు చెప్పారు. రీజియన్ పరిధిలో గల సూర్యాపేట, నల్లగొండ డిపోలకు మొదటి విడతలో భాగంగా మూడు నెలల్లో నూతనంగా 50 బస్సుల వరకు వస్తాయన్నారు. ఈ నెల 13వ తేదీన నల్లగొండలో రాజధాని బస్సు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఆర్టీసీ ఆదాయం రీజియన్‌లో మిర్యాలగూడ డిపోలో అధికంగా, అత్యల్పంగా నార్కట్‌పల్లి డిపో ఉందని పేర్కొన్నారు. ఆయన వెంట మిర్యాలగూడ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్, ఆర్టీసీ సీఐ భారతీబాయి, ఎంఎఫ్ పుష్పాల యాదగిరి తదితరులున్నారు. అదేవిధంగా జూన్‌లో ఈపీకే (ఎర్నింగ్ పర్ కిలోమీటర్) సాధించిన డ్రైవర్, కండక్టర్లను ఆర్‌ఎం రాజశేఖర్ అభినందించారు. ఈ సందర్భంగా వారికి నగదు, అవార్డు, ప్రశంసా పత్రాలు అందజేశారు.



ఉత్తమ అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఆర్‌ఎం రాజశేఖర్

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

పెద్దవూర: సమగ్ర యాజమాన్య పద్ధతులతో పత్తిలో అధిక దిగుబడులు సాధించవచ్చని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు చంద్రశేఖర్, రాములమ్మ, పల్లవి అన్నారు. శుక్రవారం పెద్దవూర మండలంలోని పెద్దగూడెం, కొత్తలూరు, తమ్మడపల్లి గ్రామాల్లో సాగవుతున్న పత్తి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, పొడి వాతావరణం వల్ల పత్తిలో రసం పీల్చు పురుగుల ఉధృతి అధికమవుతుందని తెలిపారు. ఈ లక్షణాలు గమనించిన రైతులు నీటి సౌకర్యం ఉన్న భూమిలో తడి పెట్టుకుని ఎకరాకు 40 గ్రాముల ఎపిటమిప్రిడ్‌ను పిచికారీ చేయాలని సూచించారు. నెల వయసున్న పత్తి పంటకు ఎరువులు వేయని రైతులు ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను వేసుకోవాలన్నారు. తొలి దశలో ఆశించే పురుగులను అదుపు చేసేందుకు కాండం మీద పూత పద్ధతిని పాటించాలన్నారు. మూడు పర్యాయాలు 30, 45 రోజుల్లో మోనోక్రోటోఫాస్ 1:4(ఒక భాగం మందు, 4 భాగాలు నీళ్లు) నిష్పత్తిలో వాడాలని చెప్పారు. తిరిగి 60 రోజుల వయసులో ఇమిడాక్లోప్రిడ్ 1:20 నిష్పత్తిలో (ఒక పాళ్ల మందు, 20 పాళ్ల నీరు) వాడాలని సూచించారు. కార్యక్రమంలో చక్రవర్తి, కిరణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దగూడెంలో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో శుక్రవారం గుట్కా ప్యాకెట్లను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డు వైపు గల శ్రీ ఆంజనేయ కిరణం షాప్‌లో యజమాని కండిబండ నరసింహారావు నిషేధిత గుట్కా పొగాకు ప్యాకెట్లు అమ్ముతున్నాడనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. అతడి షాప్‌లో సుమారు రూ.1,400 విలువ గల గుట్కా, పొగాకు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో నరసింహారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



పట్టుబడ్డ గుట్కా ప్యాకెట్లు

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడు దుర్మరణం

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): ఆత్మకూర్ మండల పరిధిలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. గ్రామానికి చెందిన పిడమర్తి ఎల్లయ్య (68) శుక్రవారం తన ఇంటి నుంచి గేదెను తోలుకుని వెళ్లే క్రమంలో వెనక నుంచి గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో ఎల్లయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరూ వాహనం ఆపకుండా వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఎల్లయ్య కుమారుడు రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ మృతి



మల్లేశ్ (ఫైల్)

భువనగిరి క్రైం: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. భువనగిరి పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన జెరిపోతుల మల్లేశ్(45) ఈ నెల 4న సాయంత్రం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కారు అదుపు తప్పి ఒకరు మృతి



వెంకన్న (ఫైల్)

నకిరేకల్: అతి వేగం ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. నకిరేకల్ మండలం నెల్లిబండ గ్రామానికి చెందిన ఆడెపు వెంకన్న(49) ప్రైవేట్ కంపెనీలో ఫీల్డ్ వర్క్ ఉద్యోగం చేస్తున్నాడు. రోజు మాదిరిగా వెంకన్న తన విధులు ముగించుకుని తన స్వగ్రామం నెల్లిబండకు గురువారం అర్ధరాత్రి సమయంలో తన కారులో వస్తున్నాడు. నెల్లిబండ శివారులో హైవేపై కారు అతివేగంతో ఉండడంతో అదుపు తప్పి కుడివైపుకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకన్నకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి నలుగురు కుమార్తెలు ఉన్నారు. భార్య గురువమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపి కృష్ణ తెలిపారు.

యువకుడిపై దాడి కేసులో నలుగురి అరెస్టు

- గంజాయి మత్తులో దాడికి పాల్పడినట్లు అనుమానాలు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి

సూర్యాపేటటౌన్: జిల్లా కేంద్రంలో రెండు రోజుల క్రితం యువకుడిని చితకబాదిన ఘటనలో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రవి తెలిపారు. శుక్రవారం సూర్యాపేట పోలీసు స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. గంజాయి మత్తులో యువకుల వీరంగంపై సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కేసుకు సంబంధించిన నలుగురిని అరెస్టు చేయగా మరొక యువకుడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. ఈ నెల 10న సాయంత్రం నిందితుల్లో ఒకడైన బాలుడు తన ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో కృష్ణ టాకీస్ సమీపంలో తన స్నేహితుడు కనుకు అజయ్ కనిపించగా.. అరెయ్ అజ్జు హాయ్ అని పలకరించాడు. అక్కడే ఉన్న ఆదివంశీ అనే మరో యువకుడు ఎవర్ని అరెయ్ అంటున్నావురా అని బాలుడితో గొడవ పడి అతడిని కొట్టాడు. ఈ విషయం తన బాబాయి అయిన ప్రభుకు చెప్పాడు. ఆదివంశీ బుధవారం బాలుడితో పాటు పిడమర్తి ప్రభు, పిడమర్తి రామ్‌చరణ్, కొండ ప్రదీప్, వెలుగు వినయ్‌లు ఆదివంశీని కొట్టి అక్కడి నుంచి పారారయ్యారు. ఆదివంశీ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శుక్రవారం అంబేద్కర్ నగర్‌లోని కొత్త వ్యవసాయ మార్కెట్‌లో నిందితులను పట్టుకున్నట్లు చెప్పారు. వెలుగు వినయ్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. కేసును చేదించిన పట్టణ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐలు మహేంద్రనాథ్, హెడ్ కానిస్టేబుల్స్ కృష్ణ, కరుణాకర్, సైదులు, ఆనంద్‌లను డీఎస్పీ అభినందించారు. యువకుడిపై దాడి జరిగిన స్థలాన్ని ఎస్సై బాలకృష్ణతో కలిసి డీఎస్పీ పరిశీలించారు. గంజాయి మత్తులో దాడికి పాల్పడ్డారా.. ఇంకా ఏమైనా దాగి ఉందా..? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

యువతి ఆత్మహత్యకు కారణమైన నిందితుల రిమాండ్

మిర్యాలగూడ అర్బన్: గత కొద్దిరోజులుగా ప్రేమ పేరుతో వేధించి యువతి మరణానికి కారణమైన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామం చింతలగూడం కాలనీకి చెందిన కొత్త కళ్యాణి అనే యువతిని ఆలూరి శివ, కొమ్మనబోయిన మధు అనే ఇద్దరు యువకులు ప్రేమ పేరుతో వేధించారు. దీంతో ఈనెల 6వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగింది. గుర్తించిన స్థానికులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం నల్లగొండకు తరలించారు. ఈ నెల 8న సదరు యువతి వాగ్మూలం ఇవ్వడంతో మాడుగులపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 9న చికిత్స పొందుతూ యువతి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం ఉదయం చిందతలగూడం లో ఆరూరి శివను అదుపులోకి తీసుకోగా కొమ్మనబోయిన మధును మాడుగులపల్లి టోల్‌ప్లాజా వద్ద అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర రాజు

ట్రాక్టర్ పల్టీ కొట్టి వ్యక్తి దుర్మరణం

సూర్యాపేటటౌన్: ట్రాక్టర్ పల్టీకొట్టి వ్యక్తి మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కల్వెలపాలెం గ్రామానికి చెందిన తిరుగుడు వెంకన్న(48) పొలం దున్నేందుకు సూర్యాపేటలో తన ట్రాక్టర్‌కు కల్టివేటర్‌ను చేయించుకొని తిరిగి తన ఊరికి వెళ్తున్నాడు. జిల్లా కేంద్రం సమీపంలోని కుసుమారిగూడెం వద్దకు రాగానే కుక్క అడ్డు రావడంతో ఒక్కసారి అదుపు తప్పి ట్రాక్టర్ పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ తనపై పడటంతో వెంకన్న అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

వలిగొండ: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వలిగొండ మండలంలోని టేకులసోమారంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టేకులసోమారం గ్రామానికి చెందిన చేగూరి శ్రీనివాస్(45)కు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇతను రెండు సంవత్సరాల క్రితం కుమార్తె పెళ్లి కోసమని తెలిసిన వారి దగ్గర సుమారు రూ.5 లక్షల మేర అప్పులు చేశాడు. తిరిగి చెల్లించే స్తోమత లేక జీవితంపై విరక్తి చెంది గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకున్నాడు. బయటకు వెళ్లిన భార్య అరుణ, కొడుకు ప్రసాద్ వచ్చి చూసే సరికి దూలానికి వేలాడుతూ కనిపించాడు. అతడిని కిందకి దించి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. శుక్రవారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ లాల్ తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండల పరిధిలోని చౌల్లరామారం గ్రామంలో ఓ ఇంటిలో శుక్రవారం కుళ్లిపోయిన స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల వివరాల ప్రకారం.. చౌల్లరామారం గ్రామానికి చెందిన దొంతోజు నరసింహచారి (45) భార్య రమ గత వారం రోజుల క్రితం హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న తన పిల్లలు ప్రవీణ్, పూజితల వద్దకు వెళ్లింది. నరసింహచారి నిత్యం మద్యం తాగుతుండగా.. ఈ క్రమంలో బుధవారం రాత్రి మద్యం తాగి తన ఇంటి తలుపులు పెట్టుకుని పడుకున్నాడు. శుక్రవారం ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో ఇరుగుపొరుగు వారు గమనించి, ఇంటి కిటికీలు తెరిచి చూశారు. నరసింహచారి మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో భార్య రమకు ఫోన్ చేసి తెలిపారు. శుక్రవారం సాయంత్రం కుటుంబ సభ్యులు మృతదేహానికి దహన సంస్కారాలు నిర్వహించారు. కాగా. ఈ సంఘటనపై ఎలాటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

యాదాద్రిలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం



ఉత్తర ద్వారం నుంచి స్వామివారి దర్శనానికి వెళ్తున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని శుక్రవారం దర్శించుకునేందుకు వచ్చిన భక్తులను ఉత్తర ద్వారం నుంచి ఆలయంలోకి పంపించారు. తూర్పు ద్వారం, త్రితల ద్వారాల మధ్యలో ఉన్న క్యూలైన్ సమీపంలో షెడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్తర ద్వారం నుంచి త్రితల ద్వారం మీదుగా ప్రధానాలయంలోకి అనుమతించారు. దీంతో ఉత్తర మాడ వీధిలో భక్తుల క్యూ భారీగా కనిపించింది. వివిధ పూజల ద్వారా శ్రీస్వామి వారి ఆలయానికి రూ.28,20,554 నిత్య ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

వివాహిత అదృశ్యం



ఈరమ్మ

రామగిరి(నల్లగొండ): వివాహిత అదృశ్యమైన ఘటనలో శుక్రవారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. దామరచర్ల మండలం వాడపల్లికి చెందిన భార్యాభర్తలు బండారు శివకృష్ణ, ఈరమ్మలు తిప్పర్తిలో గత ఐదు సంవత్సరాలుగా ఇల్లు అద్దెకు తీసుకుని కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈరమ్మ ఈనెల 9వ తేదీన ఉదయం కూలీ పనికి అని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన బంధువులను సంప్రదించగా ఆచూకీ లభ్యం కాలేదు. భర్త శివకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

ఉపాధ్యాయురాలికి వీడ్కోలు సమావేశం

- కన్నీటి పర్యంతమైన విద్యార్థులు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండలం తాటిపాముల ప్రాథమిక పాఠశాలలో 13 సంవత్సరాలుగా పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు సొమ్యాబాయికి శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. ఉపాధ్యాయురాలు వారిని ఓదార్చి వెళ్లారు.



ఉపాధ్యాయురాలు సొమ్యాబాయిని పట్టుకొని రోదిస్తున్న విద్యార్థులు